ప్రజాశక్తి

సోమవారం 16 సెప్టెంబర్ 2024 5 శ్రీ సత్యసాయి





.జెవివి ప్లీనం మహాసభల సందర్భంగా ప్రజలను చైతన్యం చేస్తూ గాజు పెక్కలపై నడవడం, కత్తిని గుండెల్లో గుచ్చుకోవడం మ్యాజిక్ కార్యక్రమాలను చేస్తున్న జెవివి ప్రతినిధులు



◆ ముగిసిన జెవివి రాష్ట్ర వార్షిక మహాసభ
◆ ఆద్యంతం చైతన్య భరితంగా ప్రసంగాలు
◆ పలు అంశాలపై తీర్మానాలు
◆ సైన్స్ గొప్పతనాన్ని తెలిపేలా మ్యాజిక్‌షో

ఉత్తేజభరితం.. చైతన్యపూరితం..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, అనంతపురం కలెక్టరేట్


అనంతపురం నగరంలో రెండు రోజుల పాటు జరిగిన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర 17వ వార్షిక మహాసభ ఆదివారం సాయంత్రంతో ముగిసింది. మహాసభలు ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పాల్గొన్న 400 మంది ప్రతినిధులు దేశంలోనూ, రాష్ట్రంలో పెరుగుతున్న అశాస్త్రీయ విధానాలు, మతత్వ వైఖరులతోపాటు సైన్స్ ప్రచార ఆవశ్యకతను ఈ రెండు రోజుల మహాసభలో చర్చించారు. జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ పాటు, మాజీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం రెండు రోజుల మహాసభలో పాల్గొన్నారు. ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ మాజీ అధ్యక్షులు సవ్యసాచి చటర్జీ పాల్గొని ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం జిల్లాల వారీగా సాగిన చర్చల్లో జన విజ్ఞాన వేదిక ఆయా ప్రాంతాల్లో చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. అందులో ఏ మేరకు ప్రభావం చూపగలిగిందన్నది కూడా చర్చించారు. రాబోయే రోజుల్లో ప్రజల్లోకి ఏ రకంగా వెళ్లాలి... ప్రధానంగా యువతను సైన్స్ ఉద్యమంలోకి రప్పించడం ఎలాగన్న అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ చర్చల్లో యువత కూడా పాల్గొని వారి అభిప్రాయాలను తెలియజేశారు. వాటన్నింటినీ క్రోడీకరించి భవిష్యత్ కార్యచరణను జన విజ్ఞాన వేదిక రూపొందించింది. ఈ మహాసభకు జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి కూడా విచ్చేసి రాబోయే రోజుల్లో కలసి పనిచేద్దామని పిలుపునివ్వడం అందరిలో ఉత్సాహాన్ని నింపింది. మహాసభలకు ప్రముఖ హేతువాది రాధాకృష్ణమూర్తి రెండు రోజులు విచ్చేయడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. 90 ఏళ్ల వయసులో ఆయన నడవలేని స్థితిలోనూ మహాసభ ప్రాంగణానికి విచ్చేసి సైన్స్ ఉద్యమం జయప్రదం కావాలని ఆకాంక్షను వ్యక్తం చేయడం అందరిలోనూ స్ఫూర్తిని నింపింది.



ముగింపు సందర్భంగా అభినందనలు తెలుపుతున్న రాష్ట్ర, జిల్లా జెవివి కమిటీ సభ్యులు



మాట్లాడుతున్న డా॥గేయానంద్



మాట్లాడుతున్న డా॥వి.బ్రహ్మారెడ్డి

జెవివి ప్లీనం మహాసభలో పలు అంశాలపై తీర్మానాలు

1. మతోన్మాద విష ప్రచారం నిలిపివేయాలి. దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడాలి.
2. మహిళలపై అమానుషంగా అతి హేయంగా జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టాలి. దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలి. మహిళల రక్షణకు పటిష్టమైన చట్టాలు చేపట్టాలి.
3. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యా విధానం దేశ ప్రగతికి విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదకరం. వెంటనే రద్దు చేయాలి.
4. రాష్ట్ర ప్రభుత్వం మూఢ నమ్మకాల నిరోధక చట్టం చేయలి. ప్రజల ధనమాన ప్రాణాలను కాపాడాలి.
5. యువతను నిర్వీర్యం చేస్తున్న మత్తు పదార్థలపై నియంత్రణకు చర్యలు చేపట్టాలి.

అలరించిన మ్యాజిక్ షో

కొందరు చేసే మాయల అసలు రహస్యాలను తెలిపేలా జెవివి ప్రతినిధులు ప్లీనం మహాసభల్లో ప్రజలను చైతన్య వంతం చేస్తూ మ్యాజిక్ షో ద్వారా తెలియజేశారు. కత్తిని శరీరంలోకి పొడుచుకోవడం, నాలుకపై కర్పూరం వెలిగించడం, గాజు పెంకులపై నడవడం తదితర వాటిని ప్రదర్శించారు. సైన్స్‌ను అడ్డుపెట్టుకుని కొందరు ఇలాంటి గారడీలు చేస్తున్నారని తెలియజేశారు.

రెండు రోజుల కార్యక్రమాల్లో జెవివి గౌరవ అధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డితోపాటు మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్ పాల్గొని సౌహార్ధ సందేశమిచ్చారు. రెండోవ రోజు కార్యక్రమంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు పాల్గొని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి– కొన్ని పరిశీలనలపై మాట్లాడారు. ఇలా రెండు రోజుల సైన్స్ పండుగ ఉత్సహపూరిత వాతావరణంలో జరుగుతూ అందరినీ ఆలోచింపజేశాయి. మహాసభల సందర్భంగా మధ్యమధ్యలో చేపట్టిన మ్యాజిక్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో జెవివి ప్రధాన కార్యదర్శి కుద్రా రామారావు, ఉపాధ్యక్షులు త్రిమూర్తులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరామిరెడ్డి, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయత వైపు దేశాన్ని నడిపిద్దాం : విఠపు బాలసుబ్రమణ్యం

అశాస్త్రీయతను బలవంతంగా ప్రజలపై రుద్దే పాలకుల చర్యలను ఎండగడుతూ దేశాన్ని శాస్త్రీయత వైపు నడిపించేలా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం తెలియజేశారు. జెవివి ప్లీనం రాష్ట్ర మహాసభల సందర్భంగా ముగింపు సందేశాన్ని ఇచ్చారు. తమ మతం వాడే ప్రధాని, అధ్యక్షుడు కావాలనే తపన చాలా దేశాల్లో ప్రజల్లో కన్పిస్తోందని, ఇలాంటి పరిస్థితి మనదేశంలో కూడా ఉందన్నారు. మతం ప్రాతిపకదను పాలకులను ఎన్నుకోవడం సరికాదన్నారు. సైన్స్‌కు దగ్గరగా దేశం, సమాజాం నడవాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రీయ విజ్ఞానం, ప్రయోగాల వైపు యువత ముందుకు సాగాలన్నారు. జెవివి భవిష్యత్తులో సాధించాల్సింది ఇంకా చాలా ఉందన్నారు. అందుకు సమిష్టిగా కలిసి వచ్చే సంస్థలు, విజ్ఞాన వంతులతో పని చేసి సైన్స్‌పై పెద్ద ఎత్తున ప్రచారాలు చేయాలన్నారు. విద్య, ప్రజారోగ్యం, పర్యావరణం, వ్యవసాయం, నాలుగు రంగాల్లో ప్రధానంగా పని చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర కార్యవర్గంలో పలువురు

జెవివి రాష్ట్ర కార్యవర్గంలోకి పలువురిని ప్లీనం మహాసభలో ఎన్నుకున్నారు. మాణిక్యం శెట్టి, కామేశ్వరరావు, శివనాగేశ్వర రావు, జి.మహేష్, రాజగోపాల్‌ను రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకున్నారు.



జెవివి ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

కామ్రేడ్ సీతారాం ఏచూరి సేవలు మరువలేనివి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, ఎమ్మెల్యే కందికుంట



సీతారాం ఏచూరి సంస్మరణ సభలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్, ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి-కదిరి అర్బన్

సిపిఎం జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి సేవలు మరువలేనివని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కొనియాడారు. పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో ఆదివారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాంభూపాల్, కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, వైసిపి నాయకులు వజ్ర భాస్కర్ రెడ్డి, జనసేన పార్టీ నాయకులు బ్లూమూన్ శివశంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కదిరప్ప, సీనియర్ న్యాయవాది నరసింహులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే పోరుబాటను ఎంచుకొని తుది శ్వాస వదిలే వరకూ ప్రజల కోసం పోరాడిన ప్రజా యోధుడన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, జాతీయ రాజకీయాల్లో మచ్చలేని నాయకుడిగా పేరు ప్రఖ్యాతలు గడించారన్నారు. ప్రజల స్వరాన్ని చట్టసభల్లో తనదైన శైలిలో వినిపించడం ఆయనకున్న ప్రత్యేకత అన్నారు. దేశంలో పేట్రేగుతున్న మత విద్వేష రాజకీయాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజా పోరాటాలకు దిశా నిర్దేశం చేశారన్నారు. బిజెపియేతర రాజకీయ పార్టీలను ఏకం చేసి ఒకతాటి పైకి తీసుకొచ్చిన గొప్ప మేధావి ఉన్నారు. ఆయన మరణం భారతదేశ రాజకీయాల్లో తీరని లోటు అన్నారు. దేశ ప్రజల అభివృద్ధి కోసం పరితపించిన సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగించడం ప్రస్తుత రాజకీయాల్లో చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.సుబ్బిరెడ్డి, ఈఎస్. వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు జడ్పీ.శ్రీనివాసులు, జిఎల్.నరసింహులు, ప్రజా సంఘాల నాయకులు సాంబశివ, జగన్మోహన్, ముస్తాక్, రామ్మోహన్, తాజుద్దీన్, బాలకృష్ణ, తిరుపాల్, శివన్న, నాగరాజు, రమణ, రామకృష్ణ, శ్రీరాములు, ఆర్టీసీ యూనియన్ నాయకులు యాకుబ్‌ఖాన్, రియాజ్, అంగన్వాడీ యూనియన్ నాయకులు మాబున్నీసా, లక్ష్మీదేవి, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నాయకురాళ్లు శాంతిబాయి, ఫాతిమా, మున్ని, లక్ష్మీదేవి, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్‌జాన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి చేయూత

డిపిఒ విజయ్‌కుమార్ రెడ్డి



డిపిఒ విజయ్‌కుమార్ రెడ్డి

.ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

గ్రామపంచాయతీల్లో గ్రామాలు అభివృద్ధి చెందుతేనే దేశం అభివద్ధి అవుతుందని శ్రీ సత్య సాయి జిల్లా పంచాయతీ అధికారి విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా చేయూతను అందిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను వెలిబుచ్చారు.

ప్ర: జిల్లాలో ఎన్ని పంచాయతీలు ఉన్నాయి.? వాటిలో ఏఏ అభివృద్ధి పనులు సాగుతున్నాయి.?

డిపిఒ : శ్రీ సత్యసాయి జిల్లాలో 467 పంచాయతీలు ఉన్నాయి. గ్రామాల్లో పరిశుభ్రంగా ఉంచడానికి అన్ని చర్యలూ చేపడుతున్నాం. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమాలు, దోమల నివారణకు దోమల మందును పిచికారీ చేస్తున్నాం. నీటి నిల్వలు లేకుండా చూడడం వంటి చర్యలతో పాటు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే అది ప్రజలకే హాని చేస్తుందనే విషయాలపై అవగాహన కల్పించాం.



ప్ర: పంచాయతీల్లో వేసిన అక్రమ లేఅవుట్లపై చర్యలు ఉన్నాయా.?

డిపిఒ : పంచాయతీల్లో వేసిన అక్రమ లేఅవుట్ల వల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గిపోవడమే కాక ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడానికి వీలుంటుంది. పంచాయతీ అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్లు వేసి పలువురు భారీగా సంపాదిస్తున్నారని పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా, పంచాయతీ అనుమతులు లేకుండా జిల్లా వ్యాప్తంగా చాలా లేఅవుట్లు వేశారు. అలాంటి వాటిపై చర్యలు చేపడతాం. ఇప్పటికే ఇలాంటి వాటిని గుర్తించే పనిలో అధికారులు ఉన్నారు. ఎక్కడెక్కడ ఉన్నాయనే వివరాలు సేకరించి వాటిపై ఇదివరకే చర్యలు తీసుకున్నాం. గత ప్రభుత్వంలో అక్రమంగా లేఅవుట్లు వేసిన వాటిపై పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వాటిపై తక్షణ చర్యలు తీసుకుంటాం. అప్రూవల్ లేని లేఅవుట్లకు సంబంధించి నోటీసులు మంజూరు చేసి వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్ర: పంచాయతీల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

డిపిఒ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాల ద్వారా పంచాయతీలను అభివద్ధి చేయడానికి సత్వర చర్యలు చేపడుతున్నా. ఇందులో భాగంగా ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవ అనే కార్యక్రమం నిర్వహిస్తున్నాం. కన్స్ట్రక్షన్ ఈజీ సర్వీస్ అనే నినాదంతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, డిఎల్‌పిఒలు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యి నిర్వహించనున్నాం. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి ప్రజలు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా చర్యలు చేపడుతున్నాం.

ప్ర: పంచాయతీల్లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయి..?

డిపిఒ : పంచాయతీల్లో శుభ్రత పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. తాగునీటి సరఫరా పథకాల ఓవర్ హెడ్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయిస్తున్నాం. ప్రతిరోజు క్లోరినేషన్ చేయడం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తున్నాం. చెత్తతో సంపద కేంద్రాలకు తరలించి వాటి ద్వారా సంపదను సష్టించే చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా ఉన్న 421 చెత్తతో సంపద సృష్టి కేంద్రాలను నిర్వహణ చూడటం, వాటి ద్వారా రైతులకు వాన పాములు ద్వారా తయారుచేసిన ఎరువులను విక్రచించే కార్యక్రమాలు చేపడుతున్నాం.





కొండలో జెసిబిలతో తవ్వుతున్న ఎర్రమట్టి

యథేచ్ఛగా ఎర్రమట్టి అక్రమ రవాణా

ప్రజాశక్తి-సోమందేపల్లి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎర్రమట్టి, ఇసుక, ప్రకృతి వనరులను అక్రమార్కుల నుంచి కాపాడేందుకు అనేక నిబంధనలు తీసుకొచ్చినా కొందరు అధికారులు, అధికార పార్టీ నాయకుల అండదండలతో మండలంలో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. మండల కేంద్రమైన సోమందేపల్లికి సమీపంలోని రెండు ప్రాంతాల్లో ఆదివారం పెద్దఎత్తున ఎర్రమట్టిని అక్రమంగా రవాణా చేయడం కనిపించింది. సోమందేపల్లికి సమీపంలో ఉన్న పెనుకొండ రెవెన్యూ పొలంలోని కొండ ప్రాంతంతో పాటు చెరువులో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఏర్పాటు చేసి జెసిబిలతో మట్టిని తవ్వి అడ్డూ అదుపు లేకుండా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. స్థానిక ప్రజా సంఘాల నాయకులు మండల రెవెన్యూ, మైన్స్, ఇరిగేషన్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా స్పందించలేదన్న విమర్శలు ఉన్నాయి. ఆయా శాఖల అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. అక్రమార్కులు ప్రధానంగా సెవలు దినాలు, వారాంతపు రోజుల్లో పెద్దఎత్తున ఎర్రమట్టిని తరలిస్తున్నారు. ఇప్పటికే సమీప కొండప్రాంతాలు, చెరువులో పెద్దఎత్తున ఎర్రమట్టిని తవ్వి తరలించడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇకనైనా జిల్లా ఉన్నతాధికా రులు స్పందించి అక్రమ మట్టి రవాణాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ట్రాక్టర్‌లో తీసుకుపోతున్న ఎర్రమట్టి

త్వరలో జిల్లాకు 90 నూతన బస్సులు : డిపిటిఒ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

జిల్లాకు త్వరలో 90 నూతన బస్సులు మంజూరు కానున్నాయని ఆర్టీసీ ప్రజా రవాణా అధికారి(డిపిటిఒ) మధుసూదన్ తెలిపారు. ఆయన ఆదివారం సాయంత్రం పట్టణంలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ రోజు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధర్మవరంలో జిల్లాకు చెందిన ఆరు నూతన బస్సులను ప్రారంభించారన్నారు. ఇందులో హిందూపురం డిపోకు సంబంధించి 2 హయర్ ఎక్స్‌ప్రెస్ బస్సులు, ఒక ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, పుట్టపర్తి డిపోకు ఒక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసులు ఉన్నాయన్నారు. త్వరలోనే జిల్లాకు మరో 90 నూతన బస్సులు రానున్నాయన్నారు. జిల్లా ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి ఆర్టీసీ అభివృద్ధికి చేయూతనివ్వాలని డిపిటిఒ కోరారు.



మాట్లాడుతున్న డిపిటిఒ మధుసూదన్

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

జెఎసి సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో కలిపి వెంటనే రెగ్యులర్ చేయాలని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతపురం సిఐటియు కార్యాలయం సమగ్ర శిక్ష ఉద్యోగుల హక్కుల సాధన సదస్సులో పాల్గొని మాట్లాడారు. స్కూల్ కాంప్లెక్స్ రీ ఆర్గనైజేషన్ వ్యవహారంలో ప్రభుత్వం సమగ్రంగా చర్చించిన తర్వాత ముందుకు వెళ్లాలని సూచించారు. సిఆర్‌పిలు ఎవరూ ఆందోళన చెందొద్దని, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అండగా ఉంటారని చెప్పారు, అగ్రిమెంట్ బాండ్ విధానాన్ని రద్దు కోసం ఉద్యోగులు ఐక్యంగా పోరాటాలని పిలుపుచ్చారు. చిరుద్యోగుల సమస్యల పైన కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. అనంతరం సమగ్ర శిక్ష ఉద్యోగుల రాయలసీమ ప్రాంతీయ సదస్సును ఓబురెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర జెఎసి అధ్యక్షులు కాంతారావు మాట్లాడుతూ తక్షణమే హెచ్‌ఆర్ పాలసీ, సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సమగ్ర శిక్షా పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి ఫుల్ టైమ్స్ స్కేల్ విధానాన్ని అమలు చేసి హెచ్‌ఆర్ఎ డిఎ అమలు చేసి వేతనాలు పెంచాలన్నారు. 10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ గ్రాట్యూటీ కల్పించాలి అని చెప్పారు. సామాజిక భద్రత పథకాలు ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి ఎక్స్ గ్రేషియా రూ.20 లక్షలు పెంచాలన్నారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ సెలవులు మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి రాష్ట్ర కమిటీ సభ్యులు రామన్న, జెఎసి రాష్ట్ర నాయకులు ఎ.నాగరాజు, జెఎసి జిల్లా నాయకులు సురేష్ వర్మ, నాగరాజు, మాధవ్, శంకరయ్య, నరసింహమూర్తి, నూర్ మహ్మద్, సిఐటియు అనంతపురం జిల్లా అధ్యక్షురాలు నాగమణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు నేర్పాలి

ప్రజాశక్తి-గోరంట్ల

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు నేర్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్యాటక రంగ నిపుణుడు, చరిత్రకారుడు మైనాస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాల లో ఆదివారం ఉపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన సాహితీ సాంస్కృతిక వేదిక ఘనంగా నిర్వహిం చారు. ఇందులో వివిధ ప్రాంతాల నుంచి కవులు, కళాకారులు, రచయితలు పాల్గొన్నారు. మైనాస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగు భాషకు ప్రావీణ్యత తగ్గుతోందని, కావున పాఠశాలల్లో తెలుగు భాష, సాహితీ, సాంస్కృతిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం కళాకారులు, చరిత్రకారులు, రచయితలు, కవులను ప్రోత్సహించాలన్నారు. సంప్రదాయాలు, సాహితీ, సంస్కృతి వంటి విషయాలను భావితరాలకు నేర్పకపోతే తెలుగుభాష కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. వేదికలు ఏర్పాటు చేసి తెలుగుభాష, సాహితీ, సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాలన్నారు. ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పెద్దరాసు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేటి విద్యార్థులకు వేమన శతకాలు, చరిత్ర, ఆనాటి సంస్కృతి వంటి అంశాలపై నేటి తరానికి పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు నేర్పాల్సిన అవసరం ఉందన్నారు.



సాహితీ సాంస్కృతిక వేదికపై కవులు, రచయితలను సత్కరిస్తున్న ప్రముఖులు

విద్యార్థులకు తెలుగు భాష ప్రాముఖ్యతను అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాల్లో బోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భక్తవత్సలం, రచయిత కల్లూరి రాఘవేంద్రరావు, ప్రొడ్యూసర్ జిఎం.సురేష్, మేధావి, రచయిత నరెద్దుల రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ తోటపై విష ప్రయోగం.. రూ. 1.30 లక్షల నష్టం

ప్రజాశక్తి-రొద్దం

మల్బరీ తోటపై విష ప్రయోగం చేయడంతో రూ. 1,30,000 నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయారు. వివరాలు.. మండలంలోని బీదానపల్లి గ్రామానికి చెందిన క్రిష్టప్ప తన ఒకటిన్నర ఎకరాల పొలంలో మల్బరీ పంట సాగు చేసి రేషం పురుగులు మేపుతున్నారు. దాదాపు పంట చేతికొచ్చే సమయంలో మల్బరీ తోటపై గుర్తుతెలియని వ్యక్తులు రెండు రోజుల క్రితం విష ప్రయోగం చేశారు. తర్వాత రోజు పురుగుల కోసం మేత తీసుకొచ్చిన రైతు ఆదివారం ఉదయం రేషం సిబ్బుల్లో మేత వేశారు. విష ప్రయోగం చేసిన ఆకును పురుగులు తినడంతో మొత్తం పురుగులు మృత్యువాత పడ్డాయి. మల్బరీ పంటపై విషప్రయోగం జరిగినట్లు గుర్తించిన బాధిత రైతు పెనుకొండ సిఐకు ఫిర్యాదు చేశారని సర్పంచి మంజు తెలిపారు. ఇదిలా ఉండగా జిల్లావ్యాప్తంగా మల్బరీ పంట పండించడంలో మండలంలోని ఈ గ్రామం మొదటి స్థానంలో ఉన్నట్లు రైతులు తెలిపారు. ఇలాంటి గ్రామంలో గడిచిన రెండేళ్లలోనే అది కూడా టిడిపికి చెందిన రైతుల మల్బరీ పంటలపై విష ప్రయోగాలు చేస్తున్నట్లు బాధిత రైతులు వాపోయారు. ఆరు నెలల క్రితం కంబాలపల్లి పంచాయతీ సర్పంచి మంజుకి చెందిన మల్బరీతోటపై కూడా విష ప్రయోగం చేశారు. ఇప్పుడు క్రిష్టప్పకు చెందిన పంట ఇక మూడు రోజులకి చెతికి వచ్చే సమయంలో ఇలా విష ప్రయోగం చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా పోలీసులు నిందితులను గర్తించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బీదానపల్లిలో రెండేళ్లలో మూడో సంఘటన


విష ప్రయోగంతో మరణించిన రేషం పురుగులు

నారాయణ కళాశాలపై కఠిన చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ నిబంధలను అతిక్రమించి సెలవు రోజుల్లో సైతం తరగతులు నిర్వహిస్తున్న నారాయణ కళాశాల యాజమాన్యంపై వెంటనే ఇంటర్ బోర్డు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. పట్టణంలోని నారాయణ కళాశాలలో ఆదివారం విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలుసుకుని ఎస్‌ఎఫ్ఐ బృందం కళాశాల వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు. విద్యార్థులను బయటకు పంపే వరకూ ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించడంతో కళాశాల సిబ్బంది విద్యార్థులను బయటకు పంపారు. బాబావలి మాట్లాడుతూ పట్టణంలో ప్రభుత్వ కళాశాలలతో పాటు 6 ప్రయివేటు కళాశాలలు ఉన్నాయని, అయితే ఎవరూ సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించడం లేదన్నారు. కేవలం నారాయణ కళాశాల యాజమాన్యం మాత్రమే ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి తరచూ సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తూ, విద్యార్థులను చదువుల యంత్రంగా మారుస్తున్నారన్నా రు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఇకనైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి నారాయణ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, లేనిచో విద్యార్థులతో కలిసి ఆర్ఐఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు తరుణ్, పవన్, వినయ్, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కళాశాల తరగతులను బహిష్కరిస్తున్న విద్యార్థులు

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించండి

'అనంత'లో పురం ఎంపికి ముస్లింల వినతి

ప్రజాశక్తి-హిందూపురం

వక్ఫ్ ఆస్తులను కాజేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించాలని కోరుతూ ఆదివారం పట్టణ ముస్లింలు ఆదివారం హిందూపురం ఎంపి పార్థసారధిని కలిసి విన్నవించారు. అనంతపురం నగరంలోని ఎంపి నివాసంలో అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో ముస్లింలు ఎంపి పార్థసారధిని కలిసి ఈ విషయంపై వినతి ఇచ్చి, సమస్యను వివరించారు. ఉమర్ ఫారూఖ్ ఖాన్, గోరంట్ల మైనారిటీ నాయకులు, సామాజిక సేవకుడు ఉమర్‌ఖాన్, ఇండియన్ ముస్లిం మైనారిటీ డెవలప్‌మెంట్ సభ్యులు మహబూబాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లు వక్ఫ్ సంస్థలను దెబ్బతీసేలా ఉందన్నారు. కావున అప్రజాస్వామిక వక్ఫ్ చట్ట సవరణ బిల్లును తిరస్కరించాలని కోరారు. అధికారంలో ఉన్న బిజెపి ముస్లింల హక్కులను కాలరాయడమే కాకుండా తాజాగా వక్ఫ్ ఆస్తులపై కన్నేసిందన్నారు. ఆలయాల్లో హిందూ మతానికి చెందిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మాత్రమే ఉండాలి. మరి వక్ఫ్ బోర్డులో మాత్రం ముస్లింలతో పాటు ఇద్దరు హిందూ అధికారులను నియమించడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. దేశంలో 32 వక్ఫ్ బోర్డుల్లో ఏ ఒక్క దానికైనా కేంద్రం నయా పైసా నిధులు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. దేశవ్యాప్తంగా ముస్లింలు దానం చేసిన ఆస్తులను అంబానీ, అదానీ కార్పొరేట్ సంస్థలకు కట్ట బెట్టటానికి కేంద్రం ప్రభుత్వం కుట్ర పన్నిందని వివరించారు. ఈ చట్ట సవరణ విషయంలో ముస్లింలకు బాసటగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపి బికె.పార్థసారధి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ముస్లింల మనోభావాలను గౌరవిస్తుందని, ముస్లింలకు బాసటగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం సమాజం సామాజిక సేవా సంఘాల నాయకులు అజ్మతుల్లా, ఉస్మాన్‌ఖాన్, అమానుల్లా, రఫీక్, ఫైరోజ్, సద్దాం, ముజాహిద్, షఫీ, తదితరులు పాల్గొన్నారు.


ఎంపి పార్థసారధికి వినతి ఇచ్చి సమస్యను వివరిస్తున్న మైనార్టీ నాయకులు

కదిరి నూతన డీఎస్పీగా శివనారాయణస్వామి

కదిరి అర్బన్ : కదిరి నూతన డీఎస్పీగా శివనారాయణ స్వామి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో కర్నూలు జిల్లాలో ఎసిబి డీఎస్పీగా పని చేశారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ శ్రీలతను తిరుపతి మహిళా పిఎస్ డిఎస్పీగా నియమించారు.



తలకిందులుగా 'సత్యసాయి' కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు ఆదివారం పట్టణంలోని పంప్ హౌస్ వద్ద తలకిందకి కాళ్లు పైకి పెట్టి వినూత్నంగా నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం వారు చేపట్టిన నిరసన దీక్షలు 12వ రోజుకు చేరుకున్నాయన్నారు. కార్మిక యూనియన్ నాయకుడు మధుసూదన్ మాట్లాడుతూ శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా పథకాన్ని 19 భాగాలుగా విడగొట్టి కార్మికులను కుదించేందుకు ప్రభుత్వం పూనుకుందన్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న కార్మికుల కుటుంబాలు వీధిన పడతాయన్నారు. అంతేగాక ఏ లక్ష్యం కోసం ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేశారో ఆ లక్ష్యం నీరుగారి పోతుందని, ప్రజలకు కూడా నీటి తిప్పలు తప్పవని తెలిపారు. ప్రభుత్వం పాత విధానాన్ని అమలు చేయాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మంత్రులు పర్యటిస్తున్నప్పటికీ కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు. దీక్ష శిబిరంలో కార్మికులు వెంకటేష్, ప్రభు, సాయి, హరి, తదితరులు పాల్గొన్నారు.


తలకిందులుగా నిల్చొని నిరసన తెలుపుతున్న 'సత్యసాయి' కార్మికులు

రేపు పుట్టపర్తిలో మెగా జాబ్‌మేళా

పుట్టపర్తి అర్బన్ : స్థానిక టిడిపి కార్యాలయంలో ఈ నెల 17వ తేదీ మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చొరవతో తాము ఆ కంపెనీ యాజమాన్యంతో సంప్రదించగా జాబ్‌మేళా నిర్వహించేందుకు ఆ కంపెనీవారు ముందుకొచ్చారన్నారు. చిత్తూరు, తిరుపతిలోని అమర రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీలో ఆపరేటర్లుగా ఉద్యోగావకా శాలు కల్పిస్తారన్నారు. నియోజకవర్గం లో పదో తరగతి, ఇంటర్, ఐటిఐలో పాస్ లేదా ఫెయిల్ అయినవారు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, ఫొటోలతో హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులకు టిడిపి కార్యాలయంలో భోజన సదుపాయం కల్పిస్తామని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

30న భవన నిర్మాణ కార్మికుల సమావేశం

ప్రజాశక్తి-సోమందేపల్లి

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈ నెల 30వ తేదీ స్థానిక వెంకటేశ్వర కళ్యాణ మండపంలో సమావే శం నిర్వహిస్తున్నామని, మండల వ్యాప్తం గా ఉన్న భవన నిర్మాణ కార్మికులు హాజరై జయప్రదం చేయాలని నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు పిలుపు నిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా నాయకులు నాగభూషణ అధ్యక్షతన ముఖ్యులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కొండా వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పిన ప్రకారం వెల్ఫేర్ బోర్డును తక్షణం పునరుద్ధరించాలని, కార్మికుల సంక్షేమం, ప్రమాదాల పరిహారం, పెళ్లి కానుకలు, తదితర బకాయి బిల్లులు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంఘటితం, భవిష్యత్ కార్యాచరణ కోసం ఈ నెల 30వ తేదీ నిర్వహించే సమావేశానికి రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు రవి, రంగప్ప, నిర్మాణ కార్మికులు లక్కోరి వెంకటేశులు, భాస్కర్, నాగరాజు, కుమ్మర శ్రీరాములు, దాసన్న, అంజి, సుబ్బరాయుడు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న భవన నిర్మాణ సంఘం కార్మికులు

ఎఐసిసి అధ్యక్షుడిని కలిసిన రఘువీరా

మడకశిర : ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆదివారం బెంగళూరులోని ఆయన నివాసంలో సిడబ్ల్యుసి మెంబర్, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వారు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలై సుదీర్ఘంగా చర్చించారు.


ఖర్గేకు పూలబొకే అందజేస్తున్న రఘువీరా


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు, గుండుమల

నేడు మెగా జాబ్‌మేళా

మడకశిర : పట్టణంలోని యాదవ కళ్యాణ మండపంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిరుద్యోగుల కు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పే స్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకుల కోసం అమర్ రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీ జాబ్‌మేళా నిర్వహిస్తుందని పదో తరగతి, ఐటిఐ, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. శిక్షణ అనంతరం నెలకు రూ. 22వేల గౌరవ వేతనం ఇస్తారని, నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. ఇప్పటికే చీపులేటి సమీపంలో గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల కన్వీనర్లు తమ మండలంలోని నిరుద్యోగు లను జాబ్‌మేళాకు పంపాలని తెలిపారు.

ఎపియుడబ్ల్యుజె జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎపియుడబ్ల్యుజె జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని షాదీ మహల్‌లో ఆదివారం యూనియన్ సదస్సు నిర్వహించారు. కర్నూలు, అనంతపురం జిల్లాల యూనియన్ నాయకులు నాగరాజు, పయ్యావుల ప్రవీణ్, చౌడప్ప, ఉద్దండం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నూతన జిల్లా కార్యవర్గ సభ్యులను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా చింతకాయల పుల్లయ్య, ఉపాధ్యక్షులుగా గేయానంద, ప్రధాన కార్యదర్శిగా బాబు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అలాగే ఎలక్ట్రానిక్ ఎపియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షునిగా లెక్కల హరికృష్ణ, ఉపాధ్యక్షులుగా నాగరాజు, సుధాకర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ లేనందున పాత్రికేయులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ సమస్యతో పాటు ఇంటి పట్టాలు, గృహ నిర్మాణాలు, తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సాయి ఆరామంలో సోమవారం రాష్ట్రస్థాయి సమావేశం జరుగుతుందని, రాష్ట్ర నాయకులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

పాతలింగేశ్వరస్వామిని దర్శించుకున్న శ్రీనివాస్‌మూర్తి

గుడిబండ : మండలంలోని సింగేపల్లి గ్రామంలో వెలసిన పాతలింగేశ్వరస్వామిని ఆదివారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆయనకు స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీరశైవ లింగయత్ జిల్లా అధ్యక్షులు దుర్గేష్, మడకశిర రామకృష్ణ ఐటిఐ ప్రిన్సిపల్ లింగయ్య, షబ్బీర్, రాజకుమార్, జనార్ధన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలిచ్చి వసతులు కల్పించాలని మంత్రులకు వినతి

గోరంట్ల : మండలంలోని పాలసముద్రం క్రాస్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేదలు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉన్నారని, వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంత్రులు సవిత, సత్యకుమార్‌యాదవ్‌కు వినతి పత్రాలు సమర్పించారు. మంత్రులు ఆదివారం రెడ్ క్రాస్ సొసైటీ భూమి పరిశీలన కోసం రాగా పేదలు వ్యకాసం ఆధ్వర్యంలో మంత్రులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. స్పందించిన మంత్రి సవిత మాట్లాడుతూ ఖచ్చితంగా అధికారులతో మాట్లాడి పేదలందరికీ పట్టాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, నార్సింపల్లి ఆంజనేయులు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, నాయకులు భాస్కర్, మహేష్, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు అంజలి, ఆంజనేయులు, సుజాత, లక్ష్మీదేవి, అశ్వత్తమ్మ, నూర్జహాన్, రత్నమ్మ, వెంకట రాముడు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి సవితకు వినతి పత్రం ఇస్తున్న వ్యకాసం నాయకులు పెద్దన్న

అపురూపం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఓబుళదేవరచెరువు : ఒకే పాఠశాలలో చదువుకున్న మిత్రులు 44 ఏళ్ల తర్వాత ఒక చోట కలిశారు. మండలంలోని గౌనిపల్లి జడ్పీ హైస్కూల్‌లో 1980-81 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన వారు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు జయంచంద్ర రెడ్డి పాల్గొని పూర్వ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ సేవా గుణం అలవర్చు కోవాలన్నారు. అనంతరం వారు తమ గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చలపతి, రాజారెడ్డి, శ్రీనివాసగుప్తా, జనార్ధన్‌గుప్తా, మంజుల, రత్నకుమారి, రమణారెడ్డి, మెడికల్ శ్రీనివాసరెడ్డి, నారాయణ రెడ్డి, గోవిందరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, తిరుపతమ్మ, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఈ క్రాప్ నమోదు గడువు పొడిగింపు

కొత్తచెరువు : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల ఈ క్రాప్ నమోదు గడువును ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ వరకూ పొడిగించిం దని వ్యవసాయ అధికారి నటరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పంటల ఈ క్రాప్ నమోదు పూర్తి స్థాయిలో కానందున ప్రభుత్వం గడువును పొడిగించింద న్నారు. మండలంలో ఈ క్రాప్ నమోదు చేయించుకోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

నూతన సిఐకి సన్మానం

మడకశిర : పట్టణంలో నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన రామారావును ఆదివారం మండలం లోని చందకుచర్ల పంచాయతీ టిడిపి నాయకులు సన్మానించారు. మాజీ సర్పంచి రాధమ్మ ఆంజనే యులు, డీలర్ అంజన్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం సూపర్‌వైజర్ కెబి.క్రిష్టప్ప, సీనియర్ టిడిపి నాయకుడు నరసింహారెడ్డి, అశోక్, తదితరులు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

'మిలాద్ ఉన్ నబి'ని ప్రశాంతంగా జరుపుకుందాం : డీఎస్పీ

కదిరి అర్బన్ : సోమవారం జరిగే మిలాద్ ఉన్ నబి పర్వదినాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని కదిరి డీఎస్పీ శ్రీలత సూచించారు. జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు ఆదివారం కదిరి సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయంలో డీఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు, శాంతి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవం పురస్కరించుకుని చేపట్టే ర్యాలీల సందర్భంగా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టామని డీఎస్పీ వెల్లడించారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా ఈ పర్వదినాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ కోరారు. సమావేశంలో పట్టణ సిఐ నారాయణరెడ్డి, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.


ముస్లిం మతపెద్దలతో సమావేశమైన డీఎస్పీ శ్రీలత

అట్టహాసంగా వనభోజన కార్యక్రమం

తలుపుల : స్థానిక షర్ఫుద్దీన్ బాబా వనంలో ఆదివారం తలుపుల గ్రామ పంచాయతీ లోని ప్రజలు వన భోజనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా ముందుగా వలసల గంగమ్మకు బాణాలు సమర్పించి పొట్టేళ్లు, మేకలు, కోళ్లు బలి ఇచ్చారు. అనంతరం వనంలోనే భోజనాలు వండు కొని అతిథులతో కలిసి విందు భోజనం ఆరగించారు. ఈ ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని కాంక్షిస్తూ వన భోజనం కార్యక్రమం చేపట్టామని ప్రజలు తెలిపారు.


వన భోజనంలో పాల్గొన్న గ్రామస్తులు



ఉపాధ్యాయుడు గౌస్‌లాజమ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి అవార్డు

ఓబుళదేవరచెరువు : మండలంలోని కమ్మవారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కట్టుబడి గౌస్‌లాజమ్ 2024 ఆచార్య దేవోభవ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 137వ జయంతి సందర్భంగా యువతేజం కలాం విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యాబోధన, సాహిత్య, సాంస్కృతిక, సమాజ సేవ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి జాతీయ స్థాయి అవార్డులు ప్రదానం చేసినట్లు తెలిపారు. తాను విద్యాబోధన, సామాజిక సేవా రంగాల్లో చేసిన సేవలకు ఈ అవార్డు అందజేశారని తెలిపారు. ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ముని మనవడు సుబ్రహ్మణ్యశర్మ హాజరై అవార్డును అందజేశారన్నారు. అవార్డు గ్రహీత ఉపాధ్యాయుడిని ఎంఇఒలు సురేష్‌బాబు, రమణ, పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

హంద్రీనీవా కాలువలో ముళ్ల పొదలు తొలగింపు

ధర్మవరం రూరల్ : మండలంలోని గొట్లూరు, అప్రాచెర్వు, పోతుకుంట, రేగాటిపల్లి గ్రామాల చెరువులను నింపేందుకు హంద్రీనీవా కాలువలో పెరిగిన ముళ్ల పొదలను ఆదివారం జెసిబితో తొలగిం చారు. ఆ పనులను జనసేన, టిడిపి నాయకులు పర్యవేక్షిస్తున్నారు.

క్రికెట్ పోటీల్లో ఆర్‌డిటి జట్టు ఘనవిజయం

కదిరి అర్బన్ : పట్టణంలోని ఎస్‌టిఎస్‌ఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన టి-20 క్రికెట్ పోటీల్లో ఆర్‌డిటి క్యాంపు జట్టు ఎలైట్ జట్టుపై ఘన విజయం సాధించిందని క్రికెట్ కోచ్ నజీర్ తెలిపారు. హోరాహోరీగా జరిగిన పోటీలో తొలుత బ్యాటింగ్ చేసిన ఎలైట్ జట్టు 20 ఓవర్లకు 167 పరుగులు సాధించారు. మను 45, యల్లప్ప 33 పరుగులు చేయగా ఆర్‌డిటి జట్టు బౌలర్లు సంతోష్, రేవంత్ చెరో 2 వికెట్లు తీశారు. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన ఆర్‌డిటి క్యాంప్ జట్టు 17 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. అద్భుతంగా ఆడిన దేరంగుల సాయి ప్రణీత్ 99, ప్రశాంత్ 40, ధీరజ్ 13 పరుగులు చేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు రామ్మోహన్, విశ్వ, ముబారక్, రేవంత్, తదితరులు పాల్గొన్నారు.

బంగారు నగల దుకాణంలో నగదు చోరీ

పెనుకొండ : బంగారు ఆభరణాల దుకాణంలో నగలు కొనుగోలు చేసేందుకు వచ్చిన వ్యక్తి చొక్కా జేబులో నుంచి దొంగ నగదు దొంగలించిన సంఘటన ఆదివారం పెనుకొండ పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు.. రొద్దం మండలంలోని బూచర్ల గ్రామానికి చెందిన శ్రీరాములు కుటుంబ సభ్యులతో కలిసి పెనుకొండ పట్టణంలోని ఓ బంగారు నగల దుకాణంలో నగలు కొనుగోలు చేయడానికి వచ్చారు. షాపు యజమాని వారికి నగలు చూపిస్తున్న సందర్భంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి దుకాణంలో వారి పక్కనే నిల్చొని ఓ ప్లాస్టిక్ కవర్‌ను అడ్డుపెట్టి శ్రీరాములు జేబులో నుంచి రూ. 4,500 నగదు అపహరించి చిన్నగా జారుకున్నాడు. ఇంతలో శ్రీరాములు జేబులో ఉన్న డబ్బు దొంగలించిన విషయాన్ని గుర్తించాడు. చివరకు సీసీ ఫుటేజీని పరిశీలించగా విషయం బయటపడింది. ఈ విషయంపై బాధితుడు పెనుకొండ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



బంగారు నగల దుకాణంలో నగదు చోరీ చేస్తుండగా సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యం